క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విశాఖ పట్టణానికి చెందిన పోతురాజు కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళం అందజేశారు. గురువారం ఆలయానికి విచ్చేసిన వారు ఆలయ అధికారులను కలిసి విరాళం అందజేశారు. అధికారులు వారికి కృతజ్ఞతలు తెలిపి, శ్రీస్వామి,అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. ఏఈవో సతీష్‌మాలిక్, పీఆర్వో నాగభూషణంనాయక్ రవి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే..


ఏర్పేడు : చిందేపల్లె ఎస్టీ కాలనీలో మాట్లాడుతున్న శ్రీధర్

ఏర్పేడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని రాజులపాలెం, కుమ్మరిమిట్ట, నచ్చనేరి, చిందేపల్లి ఎస్టీ కాలనీల్లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభంకావడంతో చిందేపల్లి, రాజులపాలెం పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉన్నట్లు వివరించారు. విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. సంస్థ మండల కన్వీనర్ శిరీష పాల్గొన్నారు.

ఏపీ హంస కార్యవర్గం ఏకగ్రీవం


ఎన్నికైన సభ్యులు

శ్రీకాళహస్తి: ఏపీ హంస(ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీకాళహస్తి తాలూకా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. చిత్తూరుజిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో గురువారం సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాలుకా అధ్యక్షుడిగా నాగరాజు(చీఫ్ ఫార్మసీ ఆఫీసర్, శ్రీకాళహస్తి), ఉపాధ్యక్షులుగా జయలక్ష్మి(కేవీపురం పీహెచ్‌సీ), బీకే విజయకుమారి(శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి), గంగమ్మ(ఏర్పేడు), సుభాషిణి(ఎంపేడు, కార్యదర్శిగా గౌరి(కాసరం), కోశాధికారిగా ముఖేష్‌నాథ్(కోవనూరు), ప్రచార కార్యదర్శిగా లీలా ప్రసాద్(శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి), మహిళా కార్యదర్శిగా లత(బీఎన్‌కండ్రిగ)ను ఎంపికయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీలు, కార్యనిర్వాహక కార్యదర్శి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు.


మంత్రి సత్యకుమార్‌కు ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి: రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్‌ను బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప మర్యాద పూర్వకంగా కలిసి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. గురువారం విజయవాడలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రిని ఆయనతోపాటు పలువురు బీజేపీ నాయకులు కలిశారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జ్యోత్స్న

పాకాల: తలారిపల్లికి చెందిన జ్యోత్స్న తిరుపతిలో జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్–19 ఉమెన్ సింగిల్స్ విభాగంలో విజయం సాధించారు. రాష్ట్రస్థాయిలో సెప్టెంబర్ నెలలో జరగబోయే పోటీలకు ఎంపికైన జ్యోత్స్నను కోచ్ బాలగంగాధర్ అభినందించారు. పాకాల మండలం తలారిపల్లికు చెందిన జ్యోత్స్న తల్లిదండ్రులు పార్వతి, వెంకటాద్రి సంతోషాన్ని వ్యక్తపరిచారు.

నేల కూలిన ఐదు శతాబ్దాల వృక్షం



చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం గునపాడులో గురువారం వీచిన ఈదురు గాలులకు ఐదు శతాబ్దాల నాటి భారీ వృక్షం నేలకూలింది. గ్రామంలోని శివాలయం ముందు ఉన్న ఈ చెట్టు లోపల అంతా తొర్ర ఏర్పడింది. గతంలో భారీ ఈదురు గాలులు వీచినా ఈ చెట్టు పడిపోలేదు. గురువారం వీచిన చిన్నపాటి ఈదురు గాలులకు పడి పోవడం ఆశ్చర్యంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఈ వృక్షం కూలే సమయంలో ఆ ప్రాంతంలో ఎవ్వరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

బుడిబడి అడుగులు..
చదువులకు పరుగులు



శ్రీకాళహస్తి : వివిధ పాఠశాలలకు హాజరైన విద్యార్థులు

వేసవి సెలవులు ముగిశాయి. కొత్త విద్యా సంవత్సరం మొదలైంది. ఇన్ని రోజులు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు గురువారం పాఠశాలల పునఃప్రారంభంతో తరగతి గదుల్లోకి అడుగుపెట్టారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో సందడి నెలకొంది. చాలా రోజుల తర్వాత స్నేహితులు కలవడంతో ఒకరికొకరి పలకరింతలతో పిల్లల మోముల్లో ఆనందం కన్పించింది.

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట, శ్రీకాళహస్తిలో పాఠశాలల పునః ప్రారంభంతో విద్యార్థులు ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యారు. కొత్త విద్యార్థులను చేర్చుకోవడంతలో ఉపాధ్యాయులు బిజీగా కనిపించారు. జగనన్న విద్యాకానుక స్థానంలో అందించే స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేసేందుకు విద్యాశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. కిట్లతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం కూడా అందజేయనున్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వాస్తవానికి బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉంది. అయితే కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని ఒకరోజు ఆలస్యంగా ప్రారంభించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు బోధనను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. విద్యార్థులకు మంచి విద్యాబోధన చేసి వారి భవిష్యత్తును బంగారం చేయడానికి పూర్తి కార్యాచరణ చేపట్టామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలనే సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయని, పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో..

శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో కూడా విద్యార్థుల సందడి కనిపించింది. శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ రూపాదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సాదర స్వాగతం పలికారు. పాఠశాలను సుందరంగా అలంకరించారు. పాఠశాల ఆవరణంలో సరస్వతిదేవికి పూజలు చేశారు. ఏజీఎం సురేష్, కోఆర్డినేటర్ బాలాజీ, డీన్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జ్‌లు కల్పన, జానకి, వాసంతి, త్రివేణి, థామస్, ఏవో సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో జోరుగా ప్రవేశాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి రోజు గురువారం 17 మంది అడ్మిషన్ తీసుకున్నారని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను భారీగా పెరుగుతుందని, బడి బయట పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలలో చేర్పించే విధంగా తల్లి దండ్రులను చైతన్య పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో చేర్పించాలని కుక్కంబాకం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కోదండరామ్, ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు. గురువారం దళితవాడలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో అడ్మిషన్ చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నట్లు తెలిపారు.


శ్రీకాళహస్తి : తరగతిలో సందడి


శ్రీకాళహస్తి : చదువుకు రెడీ..


బీఎన్‌కండ్రిగ: అడ్మిషన్ చేసుకుంటున్న హెచ్‌ఎం


బీఎన్‌కండ్రిగ: విద్యార్థులతో ఉపాధ్యాయులు

వైభవంగా ద్రౌపదీదేవి ఊరేగింపు



ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి,అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయాన్నే స్వామి,అమ్మవార్ల విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం భాగవతారిణి రెడ్డెమ్మ అరణ్యపర్వం హరికథాగానం చేశారు. రాత్రి అర్జునుడి తీర్థయాత్ర వీధి నాటక ప్రదర్శన అలరించింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీస్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజారి రవి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగా రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్జున తపస్మాన్

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అర్జున తపస్సుమాను కార్యక్రమం జరుగుతుందని ఆలయ చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు.

పానగల్ గంగ జాతరకు ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో వెలసిన గంగగమ్మ జాతరకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈనెల 18, 19 తేదీల్లో జాతర జరుగనున్న నేపథ్యంలో ఆలయం వద్ద చలువ పందిళ్లు వంటి ఏర్పాట్లు పనులు చేస్తున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ జాతరను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేస్తామన్నారు.

పరమేశ్వరమంగళంలో నీరు స్వచ్ఛమైందే..

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరమంగళంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లోని నీరు స్వచ్ఛమైనదేనని సెక్రటరీ ఉషారాణి స్పష్టం చేశారు. ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నందిమంగళంలో అతిసారం ప్రబలిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పరమేశ్వరమంగళంలోని ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లోని నీరు కూడా పరిశుభ్రంగా లేదంటూ కొందరు దుష్ప్రచారం చేశారని తెలిపారు. దీనిపై తాము ఇక్కడి నీటి శ్యాంపుల్స్‌ను 11న నగరిలో ఉన్న ప్రభుత్వ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబొరేటరీలో పరీక్ష చేయించినట్లు పేర్కొన్నారు. ఫలితాల్లో నీరు స్వచ్ఛమైనదేనని వచ్చినట్లు వివరించారు.

ఈ మేరకు వారు ఇచ్చిన సర్టిఫికెట్‌ను వాటర్ ప్లాంట్‌లో ఉంచినట్లు తెలిపారు. గ్రామస్తులు ఎలాంటి అనుమానాలకు పోకుండా మంచి నీటిని వినియోగించుకోవాలని కోరారు.

స్టూడెంట్ కిట్స్ అందజేత


కిట్లు అందజేస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: విద్యార్థులకు అందజేయాల్సిన స్టూడెంట్ కిట్లను హెచ్‌ఎంలకు గురువారం ఎంఈఓ కె.రవి అందజేశారు. గురుకుల పాఠశాల వద్ద జరిగిన ఈకార్యక్రమంలో ఎంఈఓ–2 ఉష మాట్లాడుతూ మండలంలోని 65 పాఠశాలల్లో చదువుతున్న 4,339 మంది విద్యార్థులకు మూడు జతల యూనిఫాం దుస్తులు, బెల్టులు, షూలు, టెక్టుబుక్స్, నోటు పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలకోనలో 22న జ్యేష్టాభిషేకం


పెంచలకోన ఆలయం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీరసింహస్వామి ఆలయంలో 22వ తేదీన జ్యేష్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జ్యేష్ఠ మాసంలో జ్యేష్టా నక్షత్రం, పౌర్ణమి ఒకేరోజు వచ్చిన సందర్భంగా వైష్ణవాలయాల్లో హోమం, అభిషేకాలు నిర్వహించడం ఆచారమన్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, పూలంగిసేవ, నరసింహ హోమం, 10 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో స్నపన పీఠంపై నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి 81 కలశాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

27న హాజరత్ ఖాదర్‌షావలీ గంధోత్సవం

నాయుడుపేట టౌన్: ఈ నెల 27 తేదీన నాయుడుపేట పట్టణంలోని హాజరత్ ఖాదర్‌షావలీ(చిన్న దర్గా) గంధోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. వారు గురువారం గంధోత్సవం కరపత్రాలు ఆవిష్కరించారు. దర్గాలో నిషాన్ జెండా వద్ద ఫాతేహాలు జరిపారు. 27 తేదీ నుంచి రెండు రోజులు గంధోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు చాన్‌బాష, శేఖర్, షేక్ రియాజ్, నీలిశెట్టి మహేంద్ర, వంశీ, చంద్రశేఖర్, మురళీ, మస్తాన్, కువ్వాకుల శ్రీనివాసులు, పఠాన్ హర్షద్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజూ పగలూ..రాత్రి


ఐకేపీ కార్యాలయ భవనంపై విద్యుత్ దీపాలు


తహసీల్దారు కార్యాలయ భవనంపై..

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దారు, ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు నాలుగు రోజులుగా పగలూ వెలుగుతుండడంపై మండల ప్రజలు ఔరా అంటున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మండల కార్యాలయాలకు విద్యుద్దీపాలంకరణలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో హుటాహుటిన వెలుగులు నింపారు. నాలుగు రోజులైనా పగలు కూడా విద్యుద్దీపాలంకరణలు వెలుగుతూనే ఉన్నాయి.

కండలేరులో 6.477 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.477 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం


దర్గాలోని సమాధుల వద్ద గంధం ఉంచుతున్న కమిటీ సభ్యులు

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ హాషీం హుస్సేనీ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన గంధోత్సవం గురువారం వేకువజామున ముగిసింది. ఇక్కడ ప్రతి ఏటా క్రమం తప్పకుండా గంధోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. గంధోత్సవానికి చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించిన గంధోత్సవంలో భాగంగా ముందుగా పట్టణంలోని దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి వారి కుమారుడు రమీజ్ గంధాన్ని భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చారు. దర్గా వద్ద మత గురువులు మగ్దూమ్ అలీషా, చిష్టివుల్ ఖాదర్, ఖమర్ అలీషా చిష్టి, ఖాజాపీర్ దర్గా పీఠాధిపతి హుస్సేనీ సాహెబ్ చిష్టి, సయ్యద్‌ఖాదరీమదారి, దిల్‌దార్ అలీషా బాసిత్, ఖాదర్‌హుస్సేన్ ఖాదరి, గౌసే మస్తాన్‌ఖాదరి, కరిముల్లాచిష్టీ, అహ్మదుల్లాహుస్సేనీ, అన్సారీ ఖాదరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు మగ్దూం, సందానీబాషా, గోల్డెన్ గౌస్, షబ్బీర్ అబ్దుల్లా, షాన్‌వాజ్ సమక్షంలో దర్గాలో గంధాన్ని లేపనం చేశారు. అనంతరం తమిళనాడుకు చెందిన ఫకీర్‌ల బృందాలు చేసిన జరబు విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులకు గంధం పంచి పెట్టారు.


దర్గా వద్దకు గంధం తీసుకువస్తున్న రియాజ్ కుటుంబ సభ్యులతో మత పెద్దలు

తొలకరి..జబ్బుల పలకరింత

మండే ఎండల నుంచి కొంత ఉపశమనం కలిగింది. ఉష్ణోగ్రతలు చల్లబడి తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు చిత్తడిగా మారుతున్నాయి. వీధుల్లో గుంతలు మురుగునీటితో నిండుతున్నాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో అపరిశుభ్రత నెలకుంటోంది. ఈ కారణంగా దోమల బెడద అధికమైంది. ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. దోమల కారణంగా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, మెదడువాపు, చికున్ గున్యా వచ్చే అవకాశం ఉంది. ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

- దోమలతో పలు వ్యాధుల విజృంభణ
- అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలకే ప్రమాదం
- పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం


పిచ్చాటూరులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

పిచ్చాటూరు: తొలకరి వర్షాల నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల నుంచి దూరం కావచ్చు. పరిసరాల పరిశుభ్రత లోపించడం కారణంగా దోమలు ప్రబలే ప్రమాదం ఉంది. ఆడ ఎనాఫిలెస్ దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాదారణంగా ఇంటి ముందు నిల్వ ఉన్న నీటిలో, మంచినీటి తొట్టెలపై పెరుగుతుంది. సాధారణంగా మలేరియా జ్వరం 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం వచ్చినప్పుడు చెమటలు పడతాయి. తలనొప్పి తీవ్ర జ్వరం వస్తుంది. వాంతులవుతాయి.

- డెంగీ: ఈ వ్యాధి టైగర్ దోమ(ఈడిస్ దోమ) వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాధారణంగా ఇంటి బయట, లోపల నిలువ ఉన్న నీటిలో గుడ్లు పెట్టి వృద్ధి చెందుతుంది. ఈ వ్యాధి 10 నుంచి 15 రోజులు వరకు ఉంటుంది. డెంగీతో ఉన్నట్లుండి జ్వరం వస్తుంది. తల నొప్పి అధికంగా ఉంటుంది. నొసటిపై నొప్పి వస్తుంది. కంటి లోపల నొప్పి, కంటి కదలికలు తగ్గి, కన్ను కదల్చినప్పుడు నొప్పి అధికంగా వస్తుంది. వాంతి అవుతుందేమోనన్న భ్రాంతి కలుగుతుంది. కడుపు నొప్పి కూడా వస్తుంది.
- చికున్ గున్యా: ఈ వ్యాధి కూడా ఈడిస్ దోమ వల్ల వ్యాప్తి చెందుతుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. ఈ వ్యాధి కూడా మామూలుగా 10 నుంచి 14 రోజులు వరకు ఉంటుంది. జ్వరం తగ్గిన తరువాత కూడా 7 నుంచి 10 రోజుల పాటు ఒళ్లు నొప్పులు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారికి అధిక జ్వరంతోపాటు ఒళ్లు నొప్పులు ఉంటాయి.
- మెదడువాపు: ఈ వ్యాధి క్యూలెక్స్ దోమ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ ఎక్కువగా మురుగునీటి నిల్వలో పెరుగుతుంది. క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాపించే అర్బోవైరస్ వల్ల కొంగలు, బాతులు, పందులు ద్వారా ఈ వ్యాధి మనుషులకు వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి కూడా 10 నుంచి 14 రోజులు పాటు ఉంటుంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తికి జ్వరం రావడంతో పాటు మత్తుగా ఉన్నట్లు ఉంటుంది. వ్యాధిగ్రస్తులు ఒక్కోసారి అపస్మారక స్థితికి వెళ్తారు. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఈ వ్యాధి 2 నుంచి 14 ఏళ్ల లోపు చిన్నారులకు అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

దోమల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలు

- గుంతలు, లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చివేయాలి. నీరు నిల్వ లేకుండా చూడాలి
- చెత్తా చెదారం మురుగు కాలువల్లో చేరకుండా చూడాలి
- మురుగు, కాలువల్లో పూడిక తీసి నీరు పారజల్లాలి
- కంప చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించాలి
- అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికోసారి దోమపిల్లల నియంత్రణ మందులు చల్లాలి
- ఇళ్ల పరిసరాల్లో ఉండే గుంతల్లో మురుగునీరు అధిక కాలం నిల్వ లేకుండా చూసుకోవాలి
- కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, సీసాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా లార్విసైడ్ మందు చల్లాలి
- రక్షణగా దోమ తెరలు వాడుకోవాలి

వైద్యులను సంప్రదించాలి



వర్షాకాలంలో జ్వరం రాగానే వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందాలి. వైద్యుల సిఫార్సుల మేరకు మందులు వాడాలి. అయినా జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణకు అవసరమైన మందులు వాడి, జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలి. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి. – హమీద్, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పిచ్చాటూరు